అసభ్యకరమైన
ప్రేమలేఖల ద్వారా
ఆమెను కృంగదీసి
అతను పొందిందేమిటి?

అనుపిండి
శ్రీనివాసరావు
కథ

# మనుషులందు సైకోలు వేరయా!

"ఏమిటే అలాగున్నావు?"

ప్రక్కన కూర్చుని టైప్ చేస్తున్న జీవితని అడిగింది ప్రియాంక.

"మామూలే!"

"అంటే..." ఏదో అర్థమయినట్లు అంది ప్రియాంక.

"అవును. అదే!" డల్‌గా చెప్పింది జీవిత.

"వాడి దగ్గర్నుంచేనా?"

"అలాగే ఉంది!"

"ఏది?"

"ఇపుడొద్దు... మాష్టారు ఘూస్తారు..."

"ఇక్కడ లేనట్టున్నారు. పర్లేదు. ఇవ్వు.. " కొద్దిగా ఏంగ్జయిటీతో అడిగింది ప్రియాంక.

"టైప్ కొట్టు. మాష్టారు వస్తున్నారు..' అంటూ తను సీరియస్‌గా టైప్ కొట్టసాగింది జీవిత. చేసేదేంలేక తనుకూడా టైప్ చెయ్యసాగింది ప్రియాంక. అంతలోనే రామనాథంగారు అక్కడికి వచ్చేశారు.

"ప్రియా! అయ్యాయా అమ్మా కబుర్లు..." వస్తూనే అడిగారు.

"కబుర్లేంటి సార్!" కంగారుని నొక్కిపట్టి ఏమీ ఎరుగనట్టు అడిగింది ప్రియాంక.

"నేను అంతా చూస్తూనే ఉన్నాను" ఏమిటే? జాకీ ఛాన్ గురించా? అనిల్ కపూర్ గురించా? చిరంజీవి గురించా? కమలహాసన్ గురించా?... దేని గురించి మాట్లాడుకుంటున్నారు?"

"సినిమాల గురించి కాదండీ!"



"''ఓహ్! అయితే మరో దాని గురించన్న మాట...''

''అది కాదూ..'' అంటూ ఏదో చెప్పబోయింది.

''చూడమ్మా ప్రియ! టైప్ ఇన్‌స్టిట్యూట్‌కి వచ్చేది టైప్ కొట్టడానికేగాని కబుర్లు చెప్పుకోవడానికి కాదని గుర్తుపెట్టుకో. అందులో ఎగ్జామ్స్ పట్టుమని నెలరోజులు

కూడా లేవు. ఈ టైప్‌లో స్పీడ్ ఎంత స్పీడ్‌గా కొట్టాలో అని ఆలోచించాలే కానీ ఎంత స్పీడ్‌గా మాట్లాడుకుందామని కాదు!'

''అదేంటిసార్! స్పీడ్‌ని తొమ్మిది నిము షాల్లో కొట్టేస్తున్నా!''

''ఎన్ని తప్పులతో?''

''అది కాదూ..''

''ఇంకేం చెప్పొద్దు!'' 'కూసేగాడిదొచ్చి మేసే గాడిదని చెడగొట్టిందని' నువ్వు టైప్ కొట్టవు. జీవితని కొట్టనివ్వవు.''

రామనాథం గారు సీరియస్‌గా చెప్పడం తో, బదులు చెప్పలేక తలదించుకుంది ప్రియాంక. ఆయన కూడా మరేం మాట్లా డకుండా వెళ్ళిపోయారు అక్కణ్ణుంచి. ప్రియాంక మవునంగా టైప్ చెయ్యసాగింది . జీవిత మధ్యలో రెండుమూడుసార్లు ఆమెకేసి చూసింది కాని ఆమె చిన్నబుచ్చు కున్న మోముతో దీక్షగా టైప్ చెయ్యడం చూసి తను కూడా మవునంగా ఉండిపోయి ంది. టైప్ మిషన్ల టకటకలతో అరగంట గడిచింది. టైమ్ చూసుకుని పేపర్స్ తీసేసి, బుక్స్ మిషన్ ప్రక్కన సర్దేసి తన పర్స్ పట్టుకుని లేచింది జీవిత. అదే సమయానికి ప్రియాంక టైమ్ కూడా అయిపోయింది. అప్పటికే ఈ మిషన్ల మీద ఆ తర్వాత కొట్టవలసిన వాళ్ళిద్దరూ వచ్చి నిలబడి ఉన్నారు. స్నేహితురాళ్ళిద్దరూ ఏం మాట్లాడుకోకుండావే టైప్ రూమ్‌లోంచి ముందున్న ఆఫీస్ రూమ్‌లోకొచ్చారు.

అక్కడ రామనాథం గారుఎవరో కుర్రా డితో అంటున్నారు.

''వీలుకాదయ్యా ఏ మిషన్ మీదా ఏ టైమూ ఖాళీ లేదు..''

''పోనీ ఈవినింగ్ ఎయిట్ టు నైన్ ఎడ్జస్ట్ చెయ్యండిసార్!''

''చూడు, బాబూ! ఎయిట్‌కి ఇన్‌స్టి ట్యూట్ క్లోజ్ చేసేస్తారు. నీ ఒక్కడి కోసం ఓపెన్ చేసి ఉంచలేను''

''మీరు అలాగంటే ఎలాసార్?''

''నేను మాత్రం ఏం చెయ్యను? మరో ఇనిస్టిట్యూట్‌లో జాయిన్ అవ్వు...''

''జాయిన్ అవ్వలేక కాదు సార్! కానీ మరో ఇనిస్టిట్యూట్ మీ ఇనిస్టిట్యూట్‌కి సాటిరాదు కదాసార్...''

ఆ మాటలు అక్షరసత్యాలు. ఏదో గవర్నమెంటు కంపెనీలో పని చేసి రిటైర్ అయిన రామనాథంగారు ఖాళీగా ఉండటం ఎందుకని టైప్ ఇనిస్టిట్యూట్ ఓపెన్ చేశారు. బాగా అనుభవజ్ఞులు అవటం చేత ప్రతీ స్టూడెంట్ మీద పర్సనల్ ఇంట్రెస్టు తీసుకోవడం చేత, అనతికాలంలోనే ఆయన ఇన్‌స్టిట్యూట్ బాగా పాపులర్ అయింది. ఎంత పాపులర్ అంటే మార్నింగ్ సిక్స్ నుంచి ఈవినింగ్ ఎయిట్ వరకు, ఉన్న ఇరవై ఇంగ్లీషు మిషన్ల మీద, పది తెలుగు మిషన్ల మీద ఒక్క గంట కూడా ఖాళీ లేనంతగా సాధారణంగా, మధ్యాహ్నాలు కాలే జీల మూలంగా టైప్ ఇనిస్టిట్యూట్‌లు ఖాళీగా ఉంటాయి. కానయితే ఆ సమయం లో కూడా క్రిక్కిరిసి ఉండటమే ఆయన ఇనిస్టిట్యూట్ ప్రత్యేకత! స్టూడెంట్స్ అంద రూ తమ టైమింగ్స్‌ని టైప్ టైమింగ్స్‌ని బట్టి ఎడ్జస్ట్ చేసుకోడం తరచూ జరిగేదే.

మధ్యాహ్నం ఖాళీగా ఉండే గృహిణులు కూడా ఆయన ఇనిస్టిట్యూట్‌కి వస్తూంటారు. అందులో షార్టుహాండ్ చెప్పడంలో ఆయనది అందెవేసిన చెయ్యి. టైప్ పాస్ చెయ్యడానికి ఆయన స్టార్టు చేసిన ఆ ఇనిస్టిట్యూట్ ఆయనకి ఊపిరి సలుపుకోనివ్వక అసిస్టెంట్స్‌ ఇద్దర్ని ఎపాయింట్ చేసుకునేలా చేసింది.

"సారీ... కుదరదు..."

ఆయన నిక్కచ్చిగా చెప్పేశారు. ఆ కుర్రాడు డిజప్పాయింటై వెనుదిరిగిపోయాడు. మామూలు సమయంలో స్టూడెంట్స్‌తో ఎంత చనువుగా ఉంటారో, డిసిప్లిన్ విషయంలో అంత కఠినంగా ఉంటారాయన. అప్ టు ది మార్క్ రావడానికి ప్రయత్నించని వాళ్ళని ఇనిస్టిట్యూట్‌లోంచి పంపేసిన సందర్భాలు కోకొల్లలు. వర్క్ విషయంలో అంత స్ట్రిక్ట్‌గా ఉండబట్టే నూటికి తొంభై అయిదు శాతం ఫలితాలని సాధిస్తూ ఉంటారాయన!

రామనాథంగారు ఖాళీగా ఉండటంతో ప్రియాంక తన పేపర్స్‌ని కరెక్షన్ కోసం అందించింది.

పేపర్స్ అందుకుంటూ "ప్రియా? తిట్టానని కోపం వచ్చిందా?" అని అడిగారాయన.

"కోపమెందుకు సార్?" కొద్దిగా మొహం గంటుపెట్టుకునే అంది ప్రియాంక.

"పెద్దవాడిని చాదస్తం ఎక్కువ! అందుకని తిడుతూ ఉంటాను. పడాలమ్మా! తప్పదు... అంతేకాని ప్రతీ చిన్నవిషయానికి ఫీలయిపోతుంటే కుదరదు. నేను చెప్పేది మీ మేలు కోరేకదా!

"అవుననుకోండి..." ఇంకేం చెప్పకూడదండీ..." నవ్వుతూ అని

"తప్పులు కూడా తగ్గించేస్తున్నావు. కీపిటప్! పేపర్స్ తిరిగిచ్చారాయన. ఎదుట వాళ్ళతో కబుర్లు చెపుతూ పేపర్స్ కరెక్ట్ చేసెయ్యడం ఆయనకి చాలా అలవాటు అయిన విషయం.



## ప్రేమ

మోహన్‌ని అడిగాడు రాజు—
"ఎంతవరకొచ్చింది మీ ప్రేమ?"
"మా ఆవిడ వరకు వచ్చేసింది" బాధగా చెప్పాడు మోహన్.
—ఎ.రమణకుమార్ (వైజాగ్)

జీవిత తన పేపర్స్ అందించింది. ఆయన చూస్తూ అన్నారు.

"ఒకసారి మీ నాన్నగారిని రమ్మని చెప్పమ్మా!"

జీవిత ఆశ్చర్యపోయింది. ఏదో ఘోరమైన తప్పు చేస్తేనే తప్ప ఇంట్లో వాళ్ళని రమ్మని వాళ్ళకి పిల్లల గురించి వార్నింగ్ ఇవ్వరాయన.

"ఏమయింది సార్?" కంగారుగా అడిగింది.

"ఏం లేదు. 'మిరేజ్' అని ఉన్న చోటల్లా 'మారేజ్' అని టైప్ కొట్టావు..అందుకని తొందరగా పప్పన్నం పెట్టించమని చెపుదామని!"

ఆయన సెన్సాఫ్ హ్యూమర్‌కి ప్రియాంకకి గట్టిగా నవ్వొచ్చింది. జీవిత కూడా రిలాక్స్‌డ్‌గా చిన్నగా నవ్వింది. అన్యమనస్కంగా టైప్ చెయ్యడంవల్ల చేసిన మిస్టేక్ అది!

పేపర్స్ తీసుకుని వస్తాం సార్ అని బయటికొచ్చారిద్దరు.

బయటికి రాగానే ప్రియాంకకి సడెన్‌గా జీవిత చెప్పింది గుర్తొచ్చింది.

"ఏదా లెటర్?" అడిగింది.

"పార్క్‌కి పోదాం పదా.."

ఇద్దరూ మవునంగా నడవసాగారు. జీవిత బాధని అర్థం చేసుకున్న ప్రియాంక కూడా ఏం మాట్లాడలేదు. ఇద్దరూ గుబురుగా ఉన్న ఒక పొద దగ్గర పచ్చగడ్డి మీద కూర్చున్నారు. నిముషమయ్యాక జీవిత మవునంగా పర్స్ లాటి కవర్ తీసి అందించింది.

మడచి ఉన్న కవర్‌ని అందుకుని టైప్ చేసి ఉన్న ఎడ్రస్‌కేసి యథాలాపంగా చూసి లోపల నుంచి కాగితం బయటికి తీసి అడిగింది ప్రియాంక.

"అయిదోదా ఇది?"

"కాదు! ఆరోది..." జీవిత డల్‌గా చెప్పింది.

ఆ కాగితం మీద మాటర్ నీట్‌గా తెలుగులో టైప్ చేసి ఉంది. ప్రియాంక చదవసాగింది.

"నా రతీదేవీ!"

అనే సంబోధనతో ఉందా ఉత్తరం. ఆ పదం చూడగానే ప్రియాంక ఒకసారి జీవితకేసి చూడసాగింది. ఆమె తల దించుకుని వేళ్ళతో పచ్చగడ్డిని పీకుతోంది. ఆమె మొహంలోని ఆవేదనని, బాధని, అంతరంగంలోనిఅలజడిని గ్రహించిన ప్రియాంక ఏం మాట్లాడకుండా మళ్ళీ చదవసాగింది.

చాలా అసహ్యాకరమైన పదాలని ఉపయోగిస్తూ ఏహ్యాకరమైన రీతిలో, సభ్యమానవులందరూ సిగ్గుపడే విధంగా చాలా పచ్చిగా సాగిందా ఉత్తరం. చదువుతున్న ప్రియాంక మొహం క్షణక్షణానికి కందగడ్డలా మారిపోతోంది. సిగ్గు కాదది! అసహ్యము!!

"ఛీ!..."


ప్రియాంక ఆ లెటర్‌ని సగంలోనే మూసేసి ఛీత్కారం చేసింది. జీవిత మొహం మబ్బులు కమ్ముకున్న ఆకాశంలా ఉంది. ఏ క్షణాన్నయినా ఆమె కళ్ళ వెంట ధారగా నీళ్ళు కురవవచ్చు! నిజంగా అమిత జాలికరమయిన స్థితి ఆమెది! కాలేజీలో జాలీగా చదివేసుకుంటున్న ఆమె పేర, ఒక

రోజు ఒక లెటర్ వచ్చింది. తనకి లెటర్ రాసే వాళ్ళెవరా అని ఒక్క క్షణం ఆశ్చర్యపోయిందా అమ్మాయి. ఆమె తీరిక సమయాల్లో జి.కె బుక్స్ చదువుతుందే కానీ ఎందుకూ పనికిరాని కాకమ్మ కథలతో నిండి ఉండే తెలుగు మాగ్‌జైన్స్ చదవదు. అందుకని పత్రికలకి లెటర్స్ రాయడం కలం స్నేహం కనపడిన అడ్డమైన శీర్షికలోనూ పాలుపంచుకోవడం లాంటి దుర్గుణాలేం అలవడలేదు. రెలిటివ్స్‌లో ఆమె పేరున లెటర్స్ రాసేవాళ్ళు ఎవరూ లేరు. అందుకని అదే ఆ అమ్మాయికి వచ్చిన మొదటి లేఖ! ఆత్రంగా చింపింది. 'కుపిడ్ (మన్మధుడు) బాణం వేసినట్టు, అది ఆటిన్ (హార్ట్)ని బద్దలుచేసినట్లు బొమ్మ ఉన్న గ్రీటింగ్ కార్డు అది. దానిక్రింద 'మై హార్ట్ ఈజ్ బ్రోకెన్...'' అని ఇంగ్లీషులో అందమయిన అక్షరాలతో ముద్రించి ఉంది. లోపల పేజీలో 'యు కాజ్డ్ ఇట్' అని మరింత అందంగా టైప్ చెయ్యబడి ఉంది.

ప్రేమ లేఖ!

జీవిత గుండె ఒక్క క్షణం ఝుళ్లుమంది!

జీవితంలో తొలి ప్రేమ లేఖ అందుకున్న వారెవరి గుండె అయినా 'జల్లు'మనే అంటుంది! అందులో పదహారేళ్ళ వయస్సు అమ్మాయి గురించి అయితే చెప్పనే అక్కర్లేదు. మరీ ఝుళ్ళుమంటుంది. ఇదీ అని చెప్పలేని భావం అమెని నిలువెల్లా ఆక్రమించి ఊపేసింది. గమ్మున కార్డ్‌ని పుస్తకాల్లో దాచేసుకుంది. కొద్దిసేపటికి తన నెవరు చూడటంలేదని నిర్ధారించుకుని మరోసారి ఆ కార్డ్‌ని చూసుకుంది. అప్పుడొచ్చిందామెకా అనుమానం. ఎవరు పంపి వుంటారు? గబగబా కార్డుని అటు ఇటు తిరగేసి చూసింది. దానిమీద ఆ మాటలు తప్పించి మరేం లేవు. కవర్లో లెటర్ లాంటిదేమయినా ఉందేమోనని ఆత్రంగా చూసింది. అలాంటివేంలేవు. ఎక్కడయినా సైన్‌గాని, ఎవరి హాండ్ రైటింగ్ అయినా ఉందేమోనని




## రక్తంలో రకాలు

మనలో బ్లడ్ గ్రూపులు ఎన్ని? అంటే చాలామంది డాక్టర్లు ఎన్ని ఉన్నాయా అని ఆలోచిస్తారు. ఇది నిజం, చేదు నిజం. మన రక్తం నాలుగు గ్రూపులుగా విభజింపబడింది. అవి 'ఎ', 'బి', 'ఎబి' మరియు 'ఒ' ఒక గ్రూపు రక్తం మరొక గ్రూపు రక్తంతో కలిసినపుడు ప్రాణాపాయం సంభవించే ప్రమాదం ఉంది. కానీ 'ఒ' గ్రూపురక్తం ఎవరికైనా ఇవ్వవచ్చును. ఒక మనిషిరక్తం ఒకే ఒక గ్రూపునకు చెంది ఉంటుంది. కాబట్టి ప్రతి ఒక్కరూ మీ రక్తం గ్రూపు ఏదో తప్పకుండా తెలుసుకుని ఉండడం అవసరం.

డా. పాణి (గోరంట్ల)

వెతికింది. ఎడ్రస్ కూడా నీట్‌గా టైప్ చేసి ఉంది. సో! ఎవరో కావాలనే అజ్ఞాతంగా ఈ కార్డ్‌ని పంపారన్నమాట!

మళ్ళీ అదే ప్రశ్న.

ఎవరు పంపి ఉంటారు?

ఆమెకి సడన్‌గా ఓ ఇరవైమందివరకూ తన క్లాస్‌మేట్స్ కళ్ళముందు మెదిలారు. వారిలో ఎవరయినా అయ్యి ఉండవచ్చు.

పదహారేళ్ళ వయసులో ఏ అమ్మాయి అయినా అందంగానే ఉంటుంది. జీవిత మాత్రం మరీ అందంగా, అందానికీ నిర్వచనం చెప్పేలా ఉంటుంది. తన అందం ఎందరినో ఆకర్షిస్తోందని గ్రహించగలిగే వయస్సు, జ్ఞానం కూడా ఆమెకీ మధ్యనే వచ్చింది. అందుకని ప్రేమలేఖ అందుకోవడం ఆమెకి పెద్దగా థ్రిల్ కలిగించలేదు. కానయితే దానిని ఇంత అందమయిన మాటలతో, ఎవరో తెలియని అజ్ఞాతమయిన వ్యక్తి దగ్గర్నుంచి అందుకోవటం మాత్రం థ్రిల్లింగ్‌గా అనిపించింది. తన ప్రాణ స్నేహితురాలైన ప్రియాంకకి విషయం చెప్పేవరకూ ఆమె మనస్సు మనస్సులో లేదు!

“కంగ్రాట్స్ నవ్వుతూ చెప్పింది ప్రియాంక. తనకి రాకుండా తన స్నేహితురాలికి లవ్ లెటర్ వచ్చిందనే కుళ్ళుకునే కుసంస్కారం ఆమెలో లేదు. అంత చవకబారు స్నేహం కాదు వాళ్ళది! మొదట్లో రెండు మూడు రోజులు వాళ్ళిద్దరు దాని గురించే మాట్లాడుకున్నా ఆ తర్వాత నెమ్మదిగా ఆ విషయం మర్చిపోతుండగా మరో లెటర్ వచ్చింది.

‘జీవితా! నా జీవన రాణీ! అంటూ ‘భావుకత్వం’ అనుకుని అమాయకత్వం గుప్పిస్తూ సగటు ప్రేమ లేఖల్లాసాగిందా లేఖ. జీవిత కాలేఖ పెద్ద ఆనందాన్ని కలిగించలేదు. విసుగ్గా ఎవరు రాశారో ఏమైనా తెలుస్తుందేమోనని చూసింది. మామూలుగానే పూర్తి టైప్ చెయ్యబడి ఉంది. యాంత్రికంగా ఆ లెటర్‌ని ప్రియాంకకి చూపెట్టింది. ‘ఏ తెలుగు నవలలోంచో కాపీ కొట్టిన బాపతులా ఉందే’ అంటూ నవ్వేసింది. అక్కడితో ఆగలేదు ఆ లెటర్స్ ప్రహసనం! మరో పదిహేను రోజులకి మరో లెటరు వచ్చింది. ఎన్నో ఏళ్ళనుంచీ ప్రియురాలిని కలుసుకుని ప్రియుడు, ఆమె సమాగమం కొరకుఎదురు చూస్తూ రాసే విరహ బాధతో నిండి ఉందా ఉత్తరం. ఈ లెటర్ గురించి ప్రియాంకా, జీవిత కూడా డిస్కస్ చేసుకున్నారు. లెటర్ లెటర్‌కీ మోతాదుమించుతోందని గ్రహించారు. వాళ్ళ మాటలు నిజమని రుజువు చెయ్యడానికి నాలుగో లెటరే సాక్ష్యం. ‘సంసార’ వార పత్రికల్లోని సెక్స్ కథల్లోని స్థాయిలో ఆ లెటర్ పూర్తిగా ఆమెతో ఇంటర్‌కోర్స్ జరపాలని ఉందని తెలియచేసింది. ఆ లెటర్‌ను చూడగానే జీవిత ప్రియాంకలు బిత్తరపోయారు. అయిదో లెటర్ ఇంకొంచెం ముందుకెళ్ళి ఇంకా పత్రికలు ప్రచురించని పదాలతో మరింత పచ్చిగా రతిలయల వర్ణనలతో నిండి ఉంది!

ఇపుడొచ్చిన ఆరో లెటర్ మరీ ఘోరం పచ్చి బూతులతో అపహ్యాకరమైన వర్ణనలతో తాను ఆమెని ఎలా అనుభవించాలనుకుం


ంటున్నాడో ఎలా అనుభవించగలడో వివరిస్తూ ఉంది!

"ఈడియెట్"

కొద్దిసేపటికి అంది ప్రియాంక. జీవితవి చూస్తుంటే ఆమెకి చాలా జాలిగా ఉంది. ఏ ఆడపిల్లకి కూడా రాకూడని కష్టం అది. ఎవరికీ సిగ్గు విడిచి చెప్పుకోలేని లజ్జాకరమైన పరిస్థితి. ఎవరు రాస్తున్నారో తెలిస్తే ఆ విషయం ఇంట్లో వాళ్ళకి చెప్పొచ్చు. ఇపుడు వాళ్ళకి చెప్పినా వాళ్ళు కూడా చెయ్యగలిగిందేం ఉండదు! బాధపడడం తప్పించి మరీ మూర్ఖంగా ఆలోచించే తల్లిదండ్రులయితే పిల్లలవి కాలేజీ మానిపించినా మానిపించెయ్యొచ్చు. కానయితే ఏమీ చెయ్యకుండా ఊరుకుంటే ఈ దుర్గంధ ప్రవాహ భరిత ఉత్తర ప్రహసనం ఆగేలా లేదు. ఇప్పటికే అసహ్యాన్ని దాటి వళ్ళంతా జలదరింపచేసే స్థాయికి చేరుకున్నాయా ఉత్తరాలు.

ఏదో ఒకటి చెయ్యక తప్పదని అర్థమైంది ప్రియాంకకి! ఆ ఏదో ఒకటో కూడా తనే చెయ్యాలని క్షోభతో కుమిలిపోతున్న తన స్నేహితురాలిని గట్టెక్కించాల్సిన బాధ్యత తనమీదుందనీ గ్రహించింది.

కానయితే ఎవరో ఎలా తెలుసుకోవాలో ఆమెకీ తెలియలేదు. ప్రతీ లెటర్ టైప్ చెయ్యబడి ఉంటోంది. ప్రతీ లెటర్ మీద హెడ్ పోస్టాఫీసు ముద్ర ఉండి లోకల్ అనే విషయాన్ని పట్టిస్తోంది. అంతే! అంతకుమించి ఇంకేవీ క్లూస్ లేవు. ఆమె ఎడ్రస్ తెలుసుకున్న ఏ పనీ పాటాలేని వెధవ అయినా ఈ పని చెయ్యొచ్చు. సహజంగానే ప్రియాంక అనుమానం తమ క్లాసులోను, తమ కాలేజీలోను హీరోలమని భ్రమసిపోతూ, అల్లరిగా రౌడీల్లా తిరిగే వాళ్ళ మీదికి మళ్ళింది! విక్కీ గాంగ్సికి రాజు గాంగ్! బాబూలు సంపాదించిన ఆస్తులు చూసుకుని అచ్చోసిన ఆంబోతుల్లా తిరుగుతూ, జెల్సాలు చెయ్యడానికి కాలేజీకి వస్తారిద్దరూ! వాళ్ళకూడా తలో పదిమంది చెంచాగాళ్ళు! వాళ్ళే ఆ పని చేస్తూ ఉంటారని ఆమె



భావించింది.

''బాధపడకే... ఎవరో కనుక్కుందాం!'

''ఎలా'' ఆశ్చర్యంగా అడిగింది జీవిత.

''ఇపుడే ఐడియా వచ్చింది..'' అంటూ చెప్పసాగింది ప్రియాంక.

* * *

విసుగ్గా వైబ్ చూసుకుంది ప్రియాంక

అపుడే అరగంట అయింది. ఆమె కళ్ళు ఆత్రంగా చుట్టు ప్రక్కల చూస్తున్నాయి. క్షణక్షణానికీ ఆమెలో నిరాశ ఆవరిస్తోంది. తను ఎంతో మాస్టర్ ప్లాన్ అనుకున్నది ఇంత ఘోరంగా ఫెయిల్ అవుతుందనుకో లేదు. ఏ మార్గం లేదు కదా అని ఏదో చీకట్లోకి రాయి విసురుదాం అనుకుంది. కానయితే రాయి తగలాల్సిన చోట తగిలిన ట్టు లేదు. మరో అరగంట చూసి నీరసంగా కాళ్ళీడ్చుకుంటూ జీవిత ఇల్లు చేరింది ఆమెని చూడగానే ఆత్రంగా తనగదిలోకి తీసుకెళ్ళి తలుపు బోల్ట్ పెట్టి అడిగింది జీవిత.

''ఏమయిందే?''

''ప్చ్'' గాఢంగా నిట్టూర్చి మంచంమీద కూర్చుంది ప్రియాంక.

జీవితలో కూడా డిజప్పాయింట్ మెంట్ కొట్టవచ్చినట్టు కనపడింది. తనుకూడా మం చంమీద ఆమె పక్కన కూలబడింది. మవునంగా రెండు నిమిషాలు గడిచాయి!

''నాకు మొదటే నీ ప్లాన్ మీద నమ్మకం కలగలేదు...'' నిశ్శబ్దాన్ని జీవితే ఛేదించింది.

''నాకూ డవుట్ గానే వుంది. .. కానీ ఏదో ఒకటి కదా అని...''

జీవిత మరేం మాట్లాడలేదు. స్నేహితు రాలు తన మీద ప్రేమతో తీసుకుంటున్న శ్రమ ఆమెని విచలితురాలిని చేస్తోంది.

''మన ప్లాన్‌లో నాకేం లూప్‌హోల్ కనపడటంలేదు....'' దీర్ఘంగా నిట్టూరిస్తూ అంది ప్రియాంక.

''నాకూ కనపడటం లేదు!''

''అంటే వాళ్ళలో ఎవరూకారేమో!''

''ఏమో....''

ఆ రోజు ఉదయం ప్రియాంక, జీవిత మామూలుగా కాలేజి కారిడర్‌లో నడుస్తూ న్నట్టే నడుస్తూ, జీవిత తన పుస్తకంలోంచి పడిపోయినట్లుగా ఒక లెటర్‌ని జారవిడిచిం ది.

''ప్రియమైన మీకు!''
మీరు రాస్తున్న లెటర్స్ అన్నీ అందుతున్నా యి. అన్నీ నా మీద మీకున్న ప్రేమని తెలియపరుస్తున్నాయి. మీతో ఎంతో మా ట్లాడాలనిపిస్తోంది. అందుకని సాయంత్రం ఆరుగంటలకి అలంకార్ థియేటర్ దగ్గరికి రండి. 'బోర్న్ టు లవ్' సినిమా చూస్తూ మాట్లాడుకుందాం. మీరంటే నాకెంతో ఇష్టం!

— మీ జీవనరాణి.''

అదీ ఆ లెటర్‌లోని సారాంశం. ఆ లెటర్‌ని అపుడే అటుగా వస్తున్న విక్కీగాంగ్ రాజు గాంగ్ చూస్తారని వాళ్ళకి తెలుసు. చూడాలన్నదే వాళ్ళ ప్లాన్! ఆ లెటర్ మామూలు వాడు ఎవరయినా చూస్తే, ఎవరు ఎవరికి రాశారో ఏమీ అర్థంకాదు.

కానయితే జీవితకి లెటర్స్ రాస్తున్న 'మిస్టర్ ఎక్స్' చూస్తే మాత్రం వాడికి పాదరసంలా అర్థమయిపోతుంది! ధైర్యంలేక ఇన్నాళ్ళు అజ్ఞాతంగా ఉండిపోయినా, అమ్మాయే నోరువిడిచి అడిగే సరికి తప్పకుండా థియేటర్ దగ్గరికి వస్తాడు. అపుడు వాడి ఐడెంటిటీ తెలుస్తుంది. అదీ వాళ్ళ ప్లాన్! ఆ ప్లాన్‌లో భాగంగానే ప్రియాంక అలంకార్ థియేటర్ దగ్గర గంటసేపు పడిగాపులు కాసింది. కానయితే, తమకి తెల్సున్న తమ క్లాస్‌మేట్స్ సరికదా, ముఖపరిచయం ఉన్న పిట్టకూడా థియేటర్ దగ్గరికి రాలేదు!

"అదీ కాకపోతే ఆ లెటర్ చదివీ పిరికిపందలా రాకపోయి ఉండొచ్చు..."

"అవును!"

"ఎనీ హౌ!... మన ప్లాన్ ఫెయిల్ అయింది!"

"ఇపుడెలాగె?" జీవిత భీతిగా అడిగింది

"కంగారుపడకు. ఇంకో ప్లాన్ వేద్దాం...

"కానీ, 'పోస్ట్' అన్నకేక వింటేవే గుండెలు దడదడలాడుతున్నాయి... ఇంట్లో ఇప్పటికే అనుమానం వచ్చినట్టుంది... తమ్ముడయితే మొన్నొచ్చిన లెటర్ ఇస్తూ, ఎక్కడ్నుంచే అవి అడిగేశాడు..."

"ఐకెన్ అండర్‌స్టాండ్!"

"ఈ టార్చర్ పగవాళ్ళకి కూడా ఉండకూడదే..."

పాపం! పదహారేళ్ళ వయస్సులోనే ఎదురయిన ఈ కష్టాన్ని చూసి బెదిరిపోతోంది 'లేడీ' కూన — జీవిత!! ప్రియాంక ఆలోచనలో మునిగి పోయింది.

* * *

"అమ్మయ్య! ఇన్నాళ్ళకి గుర్తొచ్చావన్న మాట... మరిచిపోయావేమో అనుకున్నా!'

లోపలికి వస్తున్న ప్రియాంకని చూస్తూ నవ్వుతూ అంది వసుంధర.

"మరచిపోవడంకాదు, అంటే! ఈ మధ్య అసలు ఏమీ తీరిక ఉండటంలేదు!" ఆమె ప్రక్కన కూర్చుంది.



## పందెం

రవిబాబుతో ఆశ్చర్యంగా అన్నాడు చిరంజీవి—

"ఏంటీ? ఆ రాంబాబుగాడితో నిముషానికి వంద సిగరెట్లు కాలుస్తానని పందెం కాసి గెలిచావా? అదెలా?"

"ఏమీ లేదు. ఆ వంద సిగరెట్లనీ ఒక్కసారిగా పొయ్యిలో వేశానంతే!" నవ్వుతూ చెప్పాడు రవిబాబు.

—శివభారతి (హిందూపురం)

"అవునమ్మా! అమ్మాయిగారికి తీరిక ఎక్కడ ఉంటుంది... ఐఏఎస్ కలెక్టర్ అయె! జిల్లా వ్యవహారాలన్నీ మీరే చక్కపెట్టాలి!'' వేళాకోళంగా అంది వసుంధర.

''మవ్వేం దెప్పిపొడవక్కర్లేదులే ఆంటీ! .... ఎగ్జామ్స్ దగ్గర పడ్డాయికదా. బుక్స్‌తో కుస్తీ తీవ్రతరం చేసా. అందులో మార్నింగ్ ట్యూషన్, ఈవెనింగ్ ట్రైప్, కాలేజీ... తీరిక ఎక్కడుంటుంది. చెప్పు నువ్వయితే హాయిగా కూర్చుని, చక్కగా స్వెట్టర్లు అల్లుకుంటున్నావు...'' ఆమె చేస్తున్న పని చూస్తూ అంది ప్రియాంక.

''ఇవాళ కాన్వెంట్ నుంచి వచ్చేటప్పటికి స్వెట్టర్ కుట్టి ఉంచక పోయావో నీ జట్టు కటీఫ్ – అని వార్నింగ్ ఇచ్చివెళ్ళాడు మా పుత్రరత్నం...'' నవ్వింది.

''ఇంటికొచ్చిన వాళ్ళకి కాఫీ, టీలు ఏమీ ఇవ్వవా? అంత పొదుపు పనికి రాదు. అంకుల్‌తో చెప్తానుండు...'' చనువుగా అంది ప్రియాంక.

''టీ తాగే టైమ్ అయింది. ఎవరయినా వచ్చి కాచి ఇస్తే ఎంత బాగుందునా అని అనుకుంటూ ఉండగా నువ్వొచ్చావు... అందుకని నీకో కప్ కలుపుకొని, నాకో కప్ ఇస్తే బాగుంటుంది!''

''ఇదేనా గెస్ట్‌లకి మీరిచ్చే మర్యాద?''

''అంటే నువ్వు మాకు గెస్ట్‌వా?'' ఎదురు ప్రశ్నించింది వసుంధర.

బదులు చెప్పలేక ''తప్పుతుందా?'' అంటూ కిచెన్‌లో కెళ్ళి రెండు కప్‌ల్లో టీ పెట్టి తీసుకొచ్చి తనొకటి తీసుకుని, మరొకటి వసుంధరకి అందించింది ప్రియాంక.

''ఊరకరారు మహాత్ములు అనీ — తమరు ఇప్పుడు ఎందుకు వచ్చినట్టో?''

''ఏంలేదు ఆంటీ! రేపు విజయదశమి కదా! నిన్నూ అంకుల్‌ని ప్రొద్దున్నే మాఇంటికి రమ్మని చెప్పమంది అమ్మ...''

''ఐఏఎస్ ఆఫీసర్‌గారి తల్లిగారు పిఎస్‌ గారా? ఆవిడే వచ్చి పిలవచ్చుగా?''

''నీ విమర్శలతో చంపేస్తున్నావు ఆంటీ! అక్కా, బావ పండగకి వచ్చారు. అందుకని అమ్మకి ఖాళీలేదు. నన్ను పంపింది!... తప్పక రమ్మని చెప్పమంది...''

''వస్తాం. కానీ, బాబుని ఏం చెయ్యం?''

''ఏం చెయ్యడమేంటి?'' అర్థంగాక అడిగింది ప్రియాంక.

''నన్ను, అంకుల్‌ని రమ్మన్నావు కనక మేమిద్దరమూ వస్తాం. మరి వాడిని పిలవలేదుకదా!''

''అబ్బా... సరే! తమరు, తమ సకుటుంబ సపరివార మిత్ర సమేతంగా వచ్చి మా పంచభక్ష్య పరమాన్నాల విందు ఆరగించి మమ్మల్ని ఆనందింప చేయ ప్రార్థన చాలా? బొట్టుకూడా పెట్టిపిలవనా?''

''చాల్లే!'' అని నవ్వుతూ, ''మీ 'బంకజీడి' 'ఏమైంది?' అంది వసుంధర.

''బంక జీడా?''

''అదేనమ్మా... జీళ్ళపాకంలా అతుక్కుపోయి, కలిసిమెలిసి తిరుగుతుంటారు కదా!

... జీవిత!''

''ఇది ఘోరం ఆంటీ! నన్ను ఏమైనా అనాలని ఉంటే, అను. పడతాను. అంతేకానీ, నా ఫ్రెండ్‌ని ఏమైనా అన్నావో... ఊరుకోను!'' కోపంగా అంది ప్రియాంక.

''ఉన్న మాటంటే ఉదుకెక్కువ అని మన పెద్దలు ఊరికే అనలేదు!''

''నీతో మాట్లాడలేను కానీ... వస్తాను, ఆంటీ మరచి పోకండి. మీరు రాకపోతే అమ్మ నన్ను చంపుతుంది!''

''అలాగే! తప్పకుండా వస్తాం!''

ప్రియాంక వెళ్ళడానికి లేచింది.

ఇంతలో బయటనుంచి ''పోస్ట్'' అన్నకేక వినపడింది.

ఆమాట వినగానే వసుంధర మొహం వెలవెల బోయింది. ఒక్క క్షణంలోనే సర్దుకుని, కంగారుగా ముందుగదిలోకెళ్ళి ఆత్రంగా చూసి, ఆ వచ్చినది ఇన్‌లాండ్ లెటర్ కావడం వల్ల చిన్నగా నిట్టూర్చింది. ఇదంతా చూసిన ప్రియాంక కేం అర్థంకాలేదు!

''ఏమయింది ఆంటీ?'' అని అడిగింది.

''ఏం లేదులే!'' తేరుకుని అంది వసుంధర.

''లే అన్నమాట వస్తే ఏదో ఉందని, చెప్పడం ఇష్టంలేక అలా అంటున్నారని అర్థంట... ఈ మధ్య ఏదో పుస్తకంలో చదివాను!''

''అటువంటి చెత్త పుస్తకాలు ఇంకెప్పుడూ చదవకు!''

''అంటే — నువ్వు చెప్పవన్నమాట!''

''ఏంలేదుకదా! చెప్పడానికి!''

''అయితే... సర్లే....'' కోపంగా అనేసి వచ్చెయ్యబోయింది ప్రియాంక.

''అంతకోపం ఎందుకు? అయినా చెప్పకపోతే, ఏం చేస్తావేం? ''కవ్వింపుగా అంది వసుంధర. ఆమాట వినడంతోనే

## డైట్... ప్లే?



హీరోయిన్‌గా ఇంకా నటించాలనుకుంటే స్లిమ్‌గా, స్మార్ట్‌గా ఉండాలన్న నిజం జయప్రదకి తెలుసు. అందుకే షూటింగ్‌కోసం బొంబాయి వచ్చినప్పుడు డైట్ విషయంలో ఎంతో కేర్ తీసుకుంటుంది... కొంచెం పెరుగు, ఉడకబెట్టిన కూరలు... అంతే...

షూటింగ్ అయిపోయి... బెంగుళూరు వెళ్ళిపోయాక... అన్నీ తినేస్తుంది... ఎందుకంటే సన్నగా... నాజూకుగా ఉంటే శ్రీకాంత్‌కి నచ్చదు. అతనికి నచ్చినట్టు తను తింటే... తన గుప్పెట్లో అతనుంటాడన్న నిజం జయప్రదకి తెలుసు.

షి ప్లేస్ డ్యుయల్ రోల్...

—వింజమూరి కృష్ణమూర్తి

ప్రియాంక వెళ్ళడం మానుకుని, తాపీగా వెనక్కొచ్చి సోఫాలో కూర్చుని అందికదా:—

"తెలివి నీ ఒక్కదాని సొత్తేకాదు, ఆంటీ!... ముందు చెప్పడానికి ఏముందని! ఆతర్వాత చెప్పకపోతే ఏంచేస్తావని మువ్వడగడంలోనే ఏదో దాస్తున్నావని అర్థం అయింది. అది ఏమిటో తెలిసేవరకూ కదలను కాక కదలను!"

వసుంధర ఇబ్బందిగా చూస్తూ "తప్పదంటావా?" అంది.

"తప్పదుకాక తప్పదు!"

"ఏం లేదు, ప్రియా!... ఈ మధ్య పనీపాటాలేని వెధవ ఎవడో పోకిరీ లెటర్స్ రాసి ఒకటే విసిగిస్తున్నాడు!"

"మామూలుగా వింటున్న ప్రియాంక, ఆ మాటలతో ఉలిక్కిపడింది.

"పోకిరీ ఉత్తరాలా? అంటే?" ఏంగ్జయిటీగా అరచినంత పని చేసింది.

"అవును!... చాలా అసహ్యంగా రాస్తున్నాడు. ఎవడో దౌర్భాగ్యుడు..."

"లెటర్ మొత్తం తెలుగులో టైప్ చేసి ఉంటోందా?" ప్రియాంక టెన్షన్‌తో అడిగింది.

"అవును!"

"మైహార్ట్ ఈజ్ బ్రోకెన్..."

"అవును! మొదట ఆ గ్రీటింగ్ కార్డే వచ్చింది. ఎవరో ఫూల్‌ని చెయ్యడానికి పంపి ఉంటారులే అని సరిపెట్టుకున్నాను. కానీ, ఆ తర్వాత ఒకటి దాని తర్వాత ఒకటి చొప్పున చాలా అసహ్యకరమైన ఉత్తరాలు వస్తున్నాయి..."

"ఎన్ని వచ్చాయి?"

"ఎనిమిది వచ్చినట్టున్నాయి."

"అర్జెంట్‌గా నేనా ఉత్తరాలు చూడాలి... క్విక్..." కంగారుగా అంది ప్రియాంక.

"ఆ ఉత్తరాలని దాచుకోవడం ఒకటా?! ఎప్పటికప్పుడు చూసి పారేస్తున్నాను. అయినా ఈ విషయాలు అన్నీ నీకెలా తెలుసు?" ఎదురు ప్రశ్నించింది వసుంధర.

"జీవితకికూడా అలాంటి లెటర్స్ వస్తున్నాయి..."

"నిజమా?"

"అవును! నువ్వాలెటర్స్ దాచి ఉంటే, ఆ రెండూ కంపేర్ చేసి ఆ రాస్తున్నది ఒకడో, కాదో కనుక్కునే వాళ్ళం" నిరాశగా అంది ప్రియాంక.

"చెప్పాకదా! చాలా వల్గర్‌గా ఉంటున్నాయి. అందుకని చింపి పారేస్తున్నాను. అయినా, మీ 'బంకజీడి' మాత్రం వాటినెలా దాచి ఉంచుతోంది?"

"దాచకపోతే భయం... ఇంకా దాచడం కూడానా? దాన్ని చూడగానే పాముని చూసినట్టు వణికిపోతోంది. అవన్నీ నా దగ్గరే ఉన్నాయి!"

"అవి చూస్తే నేను గుర్తుపడతాను. అయినా — ఒకేలా ఉంటున్నాయి కాబట్టి ఒకడే రాసి ఉండొచ్చు. వాకూ, జీవితకి తెలిసున్న వాడు ఎవడబ్బా?" సాలోచనగా అంది వసుంధర.

"అన్నట్టు — నువ్వుకూడా మొన్నటివరకూ మా టైప్ ఇన్‌స్టిట్యూట్‌కి వచ్చేదానివి కదూ, ఆంటీ?" ప్రియాంక ఎక్సయిట్‌మెంట్‌తో అడిగింది. అప్పటివరకూ ఆమె

ఊహించని కోణం అది!

"అవును... టైపు వీలుకాక, మాస్టారు మార్చడం కుదరదన్నారని, మానేసా!..."

"గాడ్!" అప్రయత్నంగానే అంది ప్రియాంక.

* * *

"ఏమిటే నువ్వు చెప్పేది?" విభ్రాంతిగా అడిగింది జీవిత.

"అవునే! మా వసుంధరాంటీకి కూడా నీకు వచ్చిన లెటర్స్ లాంటివే వస్తున్నాయిట!"

"అంటే?"

"ఏముంది! మనమింతకాలం కాలేజీలోని పోకిరిగాళ్ళ గురించే ఆలోచించాం — కానీ టైప్ ఇన్‌స్టిట్యూట్‌లో ఉండే వాళ్ళగురించి ఆలోచించనే లేదు!"

"నిజమే అయినా—"

"ఇంకేం చెప్పకు! ఆంటీని, నిన్ను కంబైన్డ్‌గా తెల్సున్నవాళ్ళు ఎవరో ఉంటారు? ఆంటీకూడా కొన్నాళ్ళు టైప్ నేర్చుకుంది కనక ఇది ఖచ్చితంగా టైప్‌కొచ్చేవాళ్ళపనే! అందుకే లెటర్స్ అన్నీ అంత నీట్‌గా టైప్ చేసి ఉంటున్నాయి!"

"మన ఇన్‌స్టిట్యూట్‌లోకి అలాంటి వాళ్ళెవర్నీ మాస్టార్ ఎలవ్ చెయ్యరు కదే!"

"అవును..." సాలోచనగా అంది ప్రియాంక. జీవితకూడా ఏమీ మాట్లాడలేదు. ఆ అమ్మాయి బాగా డీలా పడిపోయింది. ఏ క్షణాన ఏదో లెటర్ అందుకోవాలా అని బితుకు బితుకుమంటోంది!


"నా ఎక్స్‌పెక్టేషన్ కరెక్ట్ అయితే దట్ మిస్టర్ స్కౌండ్రల్ ఈజ్ ప్రభాకర్!" కొద్ది సేపటికి అంది ప్రియాంక.

"ఎవరు?"

"వాడేనే! మన అసిస్టెంట్ ట్యూటర్‌గాడు..."

"వాడా?"

"గొట్టం వాటం వాడూను. వెధవ



చూపులు వేసుకుని తయారు. ఒకసారి మాస్టారిలా ప్రియా అంటూ పిలిచి అతి చనువు ప్రదర్శించబోయాడు. ఐయామ్ మిస్ ప్రియాంక అని కొట్టినట్లు జవాబిచ్చా. .. ఇన్నాళ్ళు ఎందుకనుమానం రాలేదో కానీ ఇపుడు సందేహం లేదు. "వాడే!" రిలీఫ్‌గా అంది ప్రియాంక.

"వాడు కాదేమోనే..." జీవిత అనుమానంగా ఏదో చెప్పబోయింది.

"వాడే! వాడవడానికే ఛాన్సెస్ ఎక్కువ ఉన్నాయి. వాడుకాక అలాంటి లెటర్స్ టైప్ చెయ్యగల అవకాశం మరొకరికి ఉండదు. ఎందుకంటే స్టూడెంట్ ఎవరైనా ప్రైవేట్ వర్క్ చేయడానికి మాస్టారు ససేమిరా ఒప్పుకోరు. అదీగాక అందరి మధ్యలోనూ కూర్చుని టైప్ చెయ్యగల భాగోతం కూడా కాదది! సో, వంటరిగా, ఎవరూ లేనపుడు టైప్ చెయ్యాలి. ఆ ఛాన్స్ ప్రభాకర్‌కే ఎక్కువ. ఒకవేళ ఎవరయినా చూసినా ఏదో జాబ్‌వర్క్ లే అనుకుంటారు."

"నిజమే" జీవిత కూడా అంగీకరించింది.

"సెకండ్ పాయింట్! మార్నింగ్ టైమ్‌లో టైప్ కెళ్ళిన వసుంధరాంటీకి, ఈవెనింగ్ టైమ్‌లో వెళ్తున్న నీకు లెటర్స్ వస్తున్నాయంటే — ఏదో ఒక అవర్ టైప్ నేసుకెళ్ళే స్టూడెంట్స్ ఎవరికీ మీ ఇద్దరూ తెలిసే అవకాశం ఉండదు. దీనికి ప్రభాకర్‌కే అవకాశం ఉంది..."

"కరెక్ట్!"

జీవితని ప్రియాంక మాటల్లోని లాజిక్ మాత్రం ముగ్ధురాలిని చేసింది. ఇన్నాళ్ళు ఎవరేమి అనుకుంటున్నా స్టుపిడ్ ఎవరో తెలియగానే చాలా ఆనందం వేసింది. కానయితే అసలైన ప్రశ్న మిగిలే ఉంది!

"ఇప్పుడేం చేద్దాం?" అడిగింది.

"ఆడాళ్లని సెక్సింబల్స్‌గా ట్రీట్ చేసే ఆ రోగ్‌కి మళ్ళీ జన్మలో ఆడదానివి కళ్ళెత్తి చూడలేని విధంగా గుణపాఠం చెప్పాలి!"

"మా ఇంట్లో చెప్పేదా?"

"దానికన్నా మాస్టారుకి చెపితే నయమని నా ఉద్దేశ్యం!"

"మాస్టారుకి ఏమిని చెపుతాం?"

"జరిగిందే!... నా దగ్గరున్న లెటర్స్ కూడా చూపెడ్దాం!"

"ఛీ! వద్దే!... మాస్టారుకి ఆ లెటర్స్... ఛీ!"

"సిగ్గుపడాల్సిన విషయమే! కాదనను... కానీ, ఎట్ ది సేమ్ టైమ్, తప్పని పరిస్థితి కూడా... అయినా మాస్టారు పెద్దవారు. అనుభవజ్ఞులు. మన మేలు కోరేవారు. ఆయనకి చెప్పడంలో సిగ్గుపడటం అనవసరం!"

"అయినా... నేను రాను. నువ్వే వెళ్ళి అంతా చెప్పు!"

"నాకు తప్పుతుందా?" నవ్వుతూ అంది ప్రియాంక.

ఆ మాటకి జీవిత కొద్దిగా హర్ట్ అయింది.

"సారీనే! నీకు చాలా ట్రబుల్ ఇస్తున్నాను" విచలితమైన కంఠంతో బాధగా అంది.

"ఏయ్! అలాంటి మాటలు మాట్లాడి

తే తంతాను... ఏదో వరదాకి అలా అన్నాను, డోంట్ టేకిట్ సీరియస్! అయినా నీకు రాస్తే ఒకటి, నాకు రాస్తే ఒకటేనా?''

''థాంక్స్!''

''అదిగో మళ్ళీ...'' చిరుకోపం నటించింది ప్రియాంక.

''సారీ... సారీ!... అవునూ, వాడు వప్పుకుంటాడంటావా?''

''బాబూ, ఈ లెటర్స్ నువ్వే రాశావా? '' అని నెమ్మదిగా అడిగితే, రెండు కాళ్ళ జంతువు కాదు కదా, నాలుగు కాళ్ళ జంతువైనా నేను రాయలేదనే అంటుంది!''

''మరి?''

''మాస్టారుకి చెప్పడంతో మన బాధ్యత తీరిపోయినట్టే! అంతా ఆయనే చూసుకుంటారు. నా డవుట్ ప్రభాకర్ మీద అని చెప్పగానే, వాడినేమీ అడగకుండానే, వాడిని చావచితగొట్టారు మాస్టారు. ఆయన డిసిప్లిన్ సంగతి నీకు తెలుసుకదా! అపుడు చచ్చినట్టు వాడే వప్పుకుంటాడు!''

''!అంతేనంటావా?''

''అంతే!... ఇంక నువ్వు బాధపడటం మానేసి 'డోంట్ వర్రీ, బీ హేపీ' అనో, 'హేపీ డేస్ ఆర్ హియర్ ఎగైన్' అనో పాట పాడుకుంటూ కూర్చో...''

''అలాగే!'' చిన్నగా నవ్వుతూ అంది జీవిత.

''దట్స్‌గుడ్ బేబీ! నవ్వుతూ బతకాలిరా సిస్టరూ!...'' ప్రియాంక కూడా నవ్వింది.

''తమరు పని చూడండి, ఆంటీగారూ! ''

''ఆంటీయా?''

''లేకపోతే, నేను నీకు బేబీనా?''

''అనమ్మా అను... పడ్డవాళ్ళు చెడ్డవాళ్ళు కాదులే...''

''పాటలు తర్వాతలే! పని ముందులే...'

''ఓ.కె! వెళ్తున్నాను.''



## మ్యారేజ్

సోంబాబుని అడిగాడు సోమేశ్వర రావ్—

''అయితే మీ ఇద్దరిదీ ఇంటర్‌క్యాస్ట్ మ్యారేజి అన్నమాట!?''

''కాదుసార్! మేము ఇద్దరం డిగ్రీహోల్డర్స్‌మే! మాది డిగ్రీక్యాస్ట్ మ్యారేజ్'' ఠక్కున చెప్పాడు సోంబాబు.

—గుత్తుల వాసు (ఖమ్మం)

ఆకాశం మేఘావృతమై కారుచీకట్లు అలుముకున్నాయి. ఏ అదృశ్య శక్తో బిందెల తో పైనుంచి దిమ్మరిస్తున్నట్లుగా కుండపోత గా వర్షం కురుస్తోంది. ప్రొద్దున్నవరకూ ఎండతో, చిన్నమబ్బుతునక కూడా లేనట్టు న్న వాతావరణంలో ఆకస్మికమైన మార్పు వచ్చింది. జరుగుతున్న ఘోరాలనీ, దారుణా లనీ చూడలేక ప్రకృతికూడా విలపిస్తోందా అన్నట్లుందా పరిస్థితి!

వానవల్ల రోడ్డుమీద జనసంచారమసలులే దు. జీవిత తన రూమ్‌లో మంచంమీద పడుకుని రోడ్‌మీదకి ఆత్రంగా చూస్తోంది!

ప్రొద్దున అనగా వెళ్ళిన ప్రియాంక ఇప్పటివరకూ అయిపులేదు. ఏం జరిగి ఉంటుందోనని ఆమె మనసంతా అల్లకల్లోల ంగా ఉంది. మాస్టారుకి ప్రియాంక అంతా చెప్పి ఉంటుందా? మాస్టారు ఏమని ఉంటా రు? ప్రభాకర్ ఒప్పుకుంటాడా? ఒప్పుకోక పోతే, మాస్టారు ఊరుకుంటారా? అసలు లెటర్స్ రాసినది వాడేనా? వాడుకాక వేరవరై నావా? అలా అయితే ప్రభాకర్‌ని అనవసరం గా బాధపెడుతున్నామా? అన్నీ ప్రశ్నలే. అన్నింటికీ జవాబులు దొరకాలంటే ప్రి యాంక రావాలి! ఏమయిందో కానీ ప్రియా ంక రాలేదు! వానమూలంగా రాలేదని జీవిత తనకు తానే సర్దిచెప్పుకుంటోంది. కానయితే ఆమెని చూసేవరకూ మనస్సు స్థిమితపడే ట్టులేదు!

మరో అరగంట చూసి, వాన కొద్దిగా తెరిపి ఇవ్వడంతో, గొడుగు తీసుకొని బయల్దేరింది.

"ఎక్కడికీ?" తల్లి అడిగింది.

"ప్రియ దగ్గరికి!"

"గత జన్మలో మీరిద్దరూ మొగుడూ పెళ్లాలయి ఉంటారు. ఒకరిని విడిచి ఒకరు ఒక్క క్షణమైనా ఉండరు కదా!"

తల్లి వేసిన జోక్ మరో సమయంలో అయితే జీవిత నవ్వేదే!

కానయితే అలజడాందోళనా డోలాయ మానంలో మునిగివున్న జీవిత వేగంగా అడుగులేసుకుంటూ నడవసాగింది. రోడ్డం తా ఇంకా నిర్మానుష్యంగా ఉంది. వానకి తడిసిన కుక్క ఒకటి అటూ ఇటూ పరిగెడ్తోంది. చూరుపక్క చిరుగుల దుప్పటి కప్పుకుని చలికి వణుకుతున్నాడో ముసలి బిచ్చగాడు. ఆలోచనల్లో మునిగివున్న జీవిత పరిసరాలని గమనించకుండానే ప్రియాంక ఇల్లు చేరింది.

"ప్రియలేదాండీ!" ఆత్రంగా అడిగింది

"గదిలో ఉన్నట్టుందమ్మా!... ఏమయిం దోకానీ, చాలా డల్‌గా ఉంది!" ఆమె తల్లి చెప్పింది.

ఆ మాట వినగానే ప్రియాంక గుండె గుభిల్లుమంది. కంగారుగా, వేగంగా ప్రియా ంక గది చేరింది. తలుపులు దగ్గరికి వేసున్నాయి. గమ్మున తోసింది. ఆ గదంతా చీకటి వ్యాపించి ఉంది. వెంటిలేటర్‌లోంచి పడుతున్న ఒక్క వెలుగు కిరణం ప్రియాం క మొహంమీద పడి అదృశ్యమవుతోంది. రక్తం ఇంకిపోయినట్లు తెల్లగా పాలిపోయి ఉంది ఆమె మోము!

"ఏమయ్యిందే?" ఒక్క ఉదుటున

ఆమెని చేరి అడిగింది జీవిత.

ప్రియాంక నెమ్మదిగా కళ్లెత్తి ఆమెని చూసి, శుష్క మందహాసం చేసింది. కూర్చోమన్నట్లుగా ప్రక్కన చోటు చూపెట్టింది!

"మాస్టారు ఏమన్నారే? అసలు నువ్వు చెప్పేవా? ఏం జరిగింది?"

"మా—స్టా—రు" ప్రియాంక చెప్పబోయింది.

"ఏమన్నారు? చెప్పు?" కంగారుగా అంది జీవిత.

"ఏమీ అవలేదే!" దీర్ఘంగా, గాఢంగా, నిట్టూరుస్తూ అంది ప్రియాంక.

"అదేం? నువ్వసలు చెప్పలా?"

"లేదే... చెప్పలేదు..."

"ఎందుకు?"

"ఎందుకంటే — ఎందుకంటే — మాస్టారు చచ్చిపోయారు కాబట్టి..." చెప్పలేక చెప్పలేక చెప్పింది ప్రియాంక.

జీవితకి కొన్ని వేల మెగాక్యూరీల ఆటమిక్ రేడియేషన్ కలగజేసే షాక్ తగిలినట్లయింది!

"వ్వాట్?" కీచుమని అరిచింది. అప్పటివరకూ ఆమెలో ఉన్న ప్రశ్నలు, సందేహాలు ఒక్కసారిగా అదృశ్యమై మెదడంతా మొద్దుబారిపోయింది!

"అవునే... నేను వెళ్లేసరికే... మనుష్యులతో మాట్లాడే స్థాయిని దాటేసిపోయారే మాస్టారు... అంతా గోలగోలగా ఉంది. ఉండలేక మరుక్షణమే వచ్చేశాను..." ప్రియాంక బాధాతప్త కంఠంతో చెప్పింది.

జీవితకి విషయం అర్థం కావడానికి రెండు క్షణాలు పట్టింది!

"ఎ...లా... పో...యా...రు?" గొణుకుతున్నట్లు అడిగింది.

"ఆత్మహత్య చేసుకున్నారుట..."

షాక్‌కే షాక్ తగిలినట్లు — విభ్రాంతికి లోనై, అచేతనంగా నిర్విణ్ణురాలై క్రటూటలా ఉండిపోయింది జీవిత. ప్రియాంక చెప్పసాగింది.



## ఫైర్

'ఏంటే అర్థం పర్థం లేని మాటలు... జీవితం అంటే వ్యాపారమా? బుద్ధిలేని లెక్కలు, సంబంధంలేని ఈక్వేషన్సా? పెళ్లి చేసుకున్నాక తల్లిని కావాలనుకోవడం తప్పా? ఓ పాపనో, బాబునో... కన్నందుకు భర్తనుంచి రింగో, డైమండ్ నక్లెస్సో అందుకు బదులుగా ఆశిస్తుందా భార్య... ఇలా రాయడానికి ఇడియట్స్‌కి సిగ్గులేదూ... వాళ్లని కన్నందుకు బదులు వాళ్లమ్మ కూడా రింగో, నక్లెస్సో వాళ్ల తండ్రినుంచి తీసుకుందా... అయినా ఎవరి గురించి వాళ్లు మాట్లాడేది... అసలు డబ్బు మొహం చూడని వాళ్ల గురించి రాసినట్లు రాశారు..." అంటూ పత్రికవాళ్లమీద విరుచుకుపడింది డింపుల్ కపాడియా.

—వింజమూరి కృష్ణమూర్తి

''మార్నింగ్ ఇన్‌స్టిట్యూట్ తెరచి ఉండకపోవడంతో ప్రభాకర్ మాస్టారి ఇంటికి వెళ్లాడుట... ఎంత తట్టినా తలుపులు తెరుచుకోలేదుట... ఆశ్చర్యపడి, కంగారుపడి నలుగురినీ పిలిచి తలుపులు బద్దలగొట్టి లోపల చూస్తే...''

జీవిత ఏం మాట్లాడలేదు అనేకన్నా ఏం మాట్లాడాలో, ఎలా మాట్లాడాలో ఆమెకి తెలియలేదంటేనే బాగుంటుంది!

''ముందు అందరూ... నాచురల్ డెత్ అనే అనుకున్నారుట. కానీ 'సెలవ్' అని ఆయన రాసిపెట్టిన చీటీ, స్లీపింగ్ పిల్స్ బాటిల్ చూశాక... ఆత్మహత్య అని నిర్ధారించారుట.... పాపం! ఆత్మహత్య చేసుకోవాల్సిన అవసరం ఆయనకేమొచ్చిందో! నవ్వుతూ, స్టూడెంట్స్‌ని నవ్విస్తూ ఉండేవారు...'' గద్గద స్వరంతో ఆయన స్మృతులని గుర్తుచేసుకోసాగింది ప్రియాంక.

''ఆయనకెవరూ లేరనుకుంటాను...'' తేరుకుని అడిగింది జీవిత.

''లేరు!''

''అందుకేనేమో — మనల్నందర్నీ 'సొంత పిల్లల'కన్నా ఎక్కువగా 'ప్రేమ'గా చూసుకునేవారు...''

''అవును!...''

బయట ఆకాశం భయంకరంగా ఘర్జించింది. అప్పటివరకూ అలుముకున్న నీరవము హఠాత్తుగా పటాపంచలయింది. వాళ్ళిద్దరూ ఉలిక్కిపడి, ఒకరినొకరు బేలగా చూసుకున్నారు.

ఆ బాధలో వాళ్ళు గమనించనేలేదు కానీ గమనిస్తే, ఆ ఘర్జన తమ 'అజ్ఞానాన్ని' చూసి ఏ అదృశ్య శక్తో జాలిగా నవ్విన నవ్వుగా గుర్తించగలిగి ఉండేవారేమో! ఏమో! అనుభవరాహిత్యంలో జీవితపు ప్రథమాంకంలో ఉన్నవాళ్ళు గుర్తించలేకపోయినా ఆశ్చర్యంలేదు!!

* * *

''మీకు!

నా చేతి రాతతో ఈ ఉత్తరం ఉండటం చూసి మీరంతా ఆశ్చర్యపోతారని తెలుసు! మీరే కాదు! నేను కూడా ఇలాంటి లెటర్ రాయవలసి వస్తుందని ఊహించలేదు!

కానయితే, మనమూహించనిది జరగడాన్నే జీవితమంటారులా ఉంది!

ఈ ఒక్క విషయములోనే కాదు — నా జీవితంలోని ప్రతీ చిన్న విషయమూ — నేను కలలో కూడా ఊహించలేని విధంగానే జరిగింది!

ఇంతకీ, నేను ఎవరా అనుకుంటున్నారా ?

నేనే! ఇన్నాళ్ళు మీకు లెటర్స్ రాసింది నేనే! ఇంతకాలం అజ్ఞాతంగా వుండిపోవడానికీ, ఇపుడు బయటపడటానికీ గల కారణాల్ని చెప్పాలనే ఈ లెటర్!


... ప్లీజ్! దయచేసి ఈ లెటర్ ఆసాంతం చదవండి. నేను ఎవరో తెలియగానే మీరందరూ అసహ్యంతో ఈ లెటర్ చదవడం మానెయ్యకండి. నా మీద మీకున్న కోపాన్ని, ఈ లెటర్ మీద చూపెట్టకండి. ఒక విధంగా ఇది నా వీలునామా! మరణం చివరి అంచున ఉండి, రాస్తున్న ఆఖరి

ఉత్తరం. మీ అమూల్యమైన సమయాన్ని వృధా చెయ్యను. అందుకే డైరక్ట్‌గా నా జీవితంలోకి వెళ్తున్నాను.

ఇరవై ఏళ్ళు వచ్చేవరకు నా జీవితం చాలా ఆనందంగా గడిచింది. మా నాన్నకి ఉన్న లక్షలాది ఆస్తికి నేనే ఏకైక వారసుడిని! అందుకని — సహజంగానే — అమిత గారాబంగా పెంచబడ్డాను. లేకలేక పుట్టిన నన్ను మా అమ్మ కూడా ప్రాణంగా చూసుకుంది! ఎంత ప్రాణంగా అంటే పదోతరగతి వరకూ కూడా నన్ను స్కూల్‌కి పంపలేదు. బయటకెళ్తే గాలిలో దుమ్ముకి, ధూళికి కందిపోతానేమోనని భయపడేది. ఇంటిదగ్గరే ట్యూషన్స్‌తో మెట్రిక్యులేషన్ వరకూ పూర్తిచేశాను. అప్పటివరకూ నేను ఇల్లు అనే ప్రపంచంలోనే ఉండిపోయాను. నాకు తెల్సున్న వ్యక్తులు, స్నేహితులు కూడా ఎంతోమంది లేరు! మా దగ్గరి బంధువులు, నా తల్లిదండ్రులు, నా ప్రైవేట్ మాస్టార్లు, మా ఇంట్లో నౌకర్లు వీళ్లే! అందువల్ల చిన్నతనం నుంచీ ఒంటరితనం నాకు బాగా అలవాటు అయింది. శూన్యంలోకి చూస్తూ, అర్థంపర్థంలేని ఆలోచనలతో గంటలకొద్దీ గడిపేవాడిని!!

నేను కాలేజీకి రాగానే అమ్మా, నాన్నల గుండెల్లో రైళ్ళు పరిగెట్టాయి. ఎందుకంటే కాలేజీకి బయటకి వెళ్ళక తప్పదు. అదీగాక మా ఊర్లో కాలేజీ లేదు! దగ్గర్లో వున్న టవున్‌కి రోజూ వెళ్ళి రావడం కుదరదు! నేను చదవాలంటే ఆ టవున్‌లో రూమ్ తీసుకుని చదవాల్సిందే! నేను మారాము చేసి నిరాహారదీక్షల వరకూ వెళ్ళకపోతే, నా చదువు అక్కడితో ఆగిపోయేది! ఇపుడు వెనక్కి తిరిగి చూసుకుంటుంటే అనిపిస్తోంది. అలా ఆగిపోకపోవడమే — నేను చేసుకున్న దురదృష్టమని!

మొత్తానికి ఎలా అయితేనే కాలేజీలో జాయిన్ అయ్యాను. నా కోసం ఒక ఇల్లు అద్దెకి తీసుకుని, ఒక వంటావిడని, ఒక పనివాడిని అమ్మా నాన్న అమర్చారు!



అమ్మకయితే నాతోనే ఉండిపోవాలనే ఉండే ది. కానయితే నాన్న దగ్గర్లో లేకపోతే పొలం పనులేవీ సరిగ్గా జరగవు. ఉండలేక ఉండలేక నాకు దూరంగా ఉండిపోయారు!

కాలేజీ వాతావరణం మొదట్లో చాలా కొత్తగాను, వింతగాను అనిపించినా క్రమక్ర మంగా అలవాటు పడిపోయాను. ప్రపంచం ఎంత విశాలమో కొద్దికొద్దిగా అర్థం కాసాగిం ది. కానయితే ఒంటరిగా ఆలోచించుకోవడం అన్న నా అలవాటు మాత్రం పోలేదు. స్నేహితులు పెరిగారు. కానీ ప్రతీవాళ్ళతో ను అంటీ ముట్టనట్లుగా, ఎంతవరకూ అవసరమో అంతవరకే మాట్లాడుతూ ఉండేవాడిని! అందరూ టైప్‌కి వెళ్ళటం చూసి నేను కూడా టైప్‌కి వెళ్ళటం మొదలెట్టాను. అదే నా జీవితాన్ని మలుపు తిప్పింది! భయంకరమైన మలుపు!!

అక్కడే సుధతో పరిచయమైంది!

సుధ మా కాలేజీలోనే చదివేది! ఆ రోజుల్లో ఆడపిల్లలు కాలేజీ వరకూ రావడమే గొప్ప. వచ్చిన ఒకరిద్దరూ కూడా తమ చదువేదో అన్నట్లు ఉండేవారు. కానయితే సుధ ఆ రోజుల్లోనే బాగా 'ఫాస్ట్'. వాళ్ళ నాన్నగారు మిలట్రీలో పనిచేసేవారు. ఆ ధైర్యం ఆమెకి కూడా వచ్చినట్లుంది. మగ, ఆడ అన్న భేదం లేకుండా అందరితోనూ బాగా కలివిడిగా ఉండేది! ఎందుకో తెలియ దు కానీ నాతో మరింత చనువుగా ఉండేది. నిజానికి నాకు పరాయి వాళ్ళతో మాట్లాడా లంటేనే బెరుకు. అందులో అమ్మాయిలతో అయితే చెప్పనే అక్కర్లేదు. కానయితే సుధ మాత్రం నన్ను వదిలిపెట్టేది కాదు. నన్ను బలవంతంగా వాళ్ళింటికి లాక్కెళ్ళేది, నా ఇంటికి వచ్చేసేది. అందరూ మమ్మల్ని చూసి నవ్వుకోవడం, గుసగుసలాడుకోవడం చూస్తే నాకు చచ్చేంత సిగ్గుగా ఉండేది. సుధ అసలు ఏవీ పట్టించుకునేది కాదు. ఆమె నాకన్నా మూడేళ్ళు పెద్దది అని అయినా అందరూ ఎందుకు ఆలోచించరో నాకర్థమయ్యేది కాదు!!

కానయితే — ఒక వర్షం కురిసిన రాత్రి — సుధ చేత డవుట్స్ చెప్పించుకుందామని సాయంకాలం వాళ్ళింటికి వెళ్ళాను. నేను వెళ్ళేసరికే సుధ 'ఏదోలా' వుంది. — ఆ 'ఏదో' ఏంటో గుర్తించగలిగే వయస్సుకాని, ఆలోచన కాని నాకప్పటికి లేవు! నన్ను చూడగానే కళకళలాడిపోయి, ఆవేశంతో ఊగిపోయి నన్ను తన గదిలోకి లాక్కుపోయి — నేను ఉక్కిరిబిక్కిరయిపోయాను. సుధ అలా చేస్తుందని నేను కలలో కూడా ఊహించలేదు. ఆమె పిటపిటలాడే పరువ ము నన్ను ఉత్తేజితుడ్ని చెయ్యలేదు. పైకదా, భయపెట్టింది. సుధ నా చేత తన కోరిక తీర్చుకోవాలని చాలాసేపు శ్రమపడింది! కానీ నా మనస్సు, శరీరం కూడా ఆమెకి సహకరించలేదు!! ఫలితం—


"కొజ్జా నా కొడకా!"

అదీ ఆమె కోపంతో నన్ను తిట్టిన తిట్టు. నాకు ఏం చెయ్యాలో తెలియలేదు. సిగ్గుతో తలదించుకుని ఇంటికి వచ్చేశాను. కానయితే ఆ ఆలోచనలు నన్ను వీడలేదు! కొన్ని వేల స్వరాలు నా చెవుల్లో ఆ మాటతో అరుస్తున్నట్లు ఫీలయ్యాను. ఎవరికీ చెప్పుకో లేని సంఘటన అది. పైగా అవమానము,

అనుమానం! నా శక్తి మీద నాకే అనుమానం ప్రారంభమయింది. ఏం చెయ్యాలో తెల్సేది కాదు. సుధని ఆ తర్వాత చూడాలంటేనే వెన్నులో వణుకు పట్టుకుంది! ఆవేశంతో కోపంతో ఎర్రబడిన ఆమె నగ్న శరీరం, ఆశాభంగం పొందిన ఆమె మొహం నేను ఎప్పటికీ మరచిపోలేను. ప్రతిరాత్రి ఆమే గుర్తొచ్చేది. ఆమె అన్న ఆ మాట కూడా! వంటరిగా మథనపడుతూ ఉండేవాడిని. యాంత్రికంగా కాలేజీకి వెళ్ళేవాడిని. సుధకి కనపడకుండా ఉండాలని విశ్వప్రయత్నం చేసేవాడిని. కానయితే ఒకరోజు ఆమెకి దొరికిపోయాను. కనపడగానే సుధ నన్ను చూసి నవ్వింది. హేళనగా, వెకిలిగా... ఆ నవ్వులో ఎన్నో అర్థాలు. తన పక్కనున్న వాళ్ళతో ఏదో చెప్పి పడిపడి నవ్వింది. వాళ్ళందరూ కూడా నన్ను చూసి నవ్వారు! ఆ క్షణం నుంచీ నాకు 'నరకం' భూమి మీదే ఉందని అనుభవపూర్వకంగా అర్థమయింది! ప్రతీ వాళ్ళు నన్ను చూసి నవ్వుకుంటున్నట్లుగా అనిపించేది! రాత్రుళ్ళు నిద్రపట్టేది కాదు. దిండులో తల పెట్టుకుని నాలో నేను కుమిలిపోయేవాడిని! కొన్నాళ్ళకి సుధ పెళ్ళి చేసుకుని తన దారిన తను పోయింది. కానయితే ఆమె జ్ఞాపకాలు మాత్రం నన్ను వదలలేదు... ఆమె నగ్న శరీరం... ఆమె మొహం... అన్నింటినీ మించి ఆమె తిట్టిన తిట్టు... ఆ సంఘటన నన్ను పట్టిపట్టి బాధించేది! ఎలాగో పి.యు.సి కంప్లీట్ చేశాను!

ఈలోగా మరో ఆపద నన్ను చుట్టుముట్టింది. అది మా ఇంట్లో జరుగుతున్న నా పెళ్ళి ప్రయత్నాలు! ఏం చెయ్యాలో పాలుపోలేదు. నా మగతనం మీద నాకింకా అనుమానం పోలేదు.

అందమయిన స్త్రీలపట్ల కోరికలు కలిగేవి కానీ ఆ మరుక్షణమే సుధ గుర్తొచ్చి జావకారిపోయేవాడిని! అటువంటప్పుడు పెళ్ళికి నేను అనర్హుడినని ఎలా చెప్పాలో, ఎవరికి చెప్పాలో తెలియలేదు. చివరికి నా



## వేషం

నర్స్‌ని అడిగాడు రాంబాబు.

"మా నాన్నగారి ఆపరేషన్ ఫెయిలయ్యిందా? ఎలా చెబుతున్నారు సిస్టర్?"

"అటు చూడండి... డాక్టర్‌గారు మారువేషంలో పారిపోతున్నారు మరి!" చెప్పింది నర్స్.

—పద్మశ్రీ (మాణిక్యారం)

ప్రమేయం ఏం లేకుండానే ఒక అమ్మాయితో నా పెళ్ళి నిశ్చయం చేశారు. నా గుండెల్లో రాయి పడింది. నా బాధనంతా నాకున్న స్నేహితుల్లో ఒకడి దగ్గర వెళ్ళగక్కుకున్నాను. వాడు ధైర్యం చెప్పి మరోసారి ట్రైచెయ్యమని ఒక వేశ్య దగ్గరకి పంపాడు. కానయితే నేను వెళ్లేసరికే నగ్నంగా ఉన్న ఆమెను చూడగానే సుధ... నవ్వు... తిట్టు... అన్నీ గుర్తొచ్చి... ఆమెకూడా అదే సర్టిఫికెట్ నాకిచ్చింది! ఆ తర్వాత నా ఫ్రెండ్‌కి కూడా ఏమీ చెప్పలేదు. మానసికంగా ఆ ముద్ర నా మీద పడింది! సో... ఐ బికేమ్ మెంటల్లీ ఇంపొటెంట్!

ఎంత వద్దని మొత్తుకున్నా నా పెళ్ళి ఆగలేదు. ఈ రోజుల్లో అయితే ప్రతీవాళ్ళకి పెళ్ళి వద్దనడం ఫాషన్ అయిపోయింది. కానీ మా రోజుల్లో అలాకాదు! ఇరవై ఏళ్ళకే ఇద్దరు పిల్లల తండ్రులయ్యేవారందరూ! పైకి ఎవరికీ చెప్పుకోలేక భయపడుతూనే తాళికట్టేశాను... బట్ ఐ యామ్ నాట్ ఏబుల్ టూ ఓవర్ కమ్ మై ఫాల్టీ వే ఆఫ్ థింకింగ్! ఫలితం.

ఆర్నెల్ల వరకూ నా చేతకానితనాన్ని సహించినా ఉప్పూకారం తింటున్న నా భార్య ఇంక ఊరుకోలేక పుట్టింటికిపోయింది. వాళ్ళింట్లో గోల అయింది. వాళ్ళందరూ వచ్చిన మా ఇంట్లో గగ్గోలు చేశారు. నేను 'మేడిపండు'నని అందరూ తీర్మానించారు. వాళ్ళిచ్చిన కట్నం వాళ్ళకిచ్చేసి నాన్న వాళ్ళని పంపేశారు. కానయితే అప్పటికే ఆ విషయం అందరికీ తెలిసిపోయింది. ప్రతి మగాడూ కలలోకూడా అటువంటి సంఘటనల్ని ఊహించుకోలేడు. అందరూ గుసగుసలాడుకునేవాళ్ళే. నవ్వేవాళ్ళు... నాకు ఏం చెయ్యాలో తోచేది కాదు. అసలే ఇంట్రావర్ట్‌నయిన నేను నాలోకి మరింత ముడుచుకుపోయాను

చివరికి మా అమ్మకూడా నన్ను అర్థం చేసుకోలేకపోయింది. మా నాన్నకూడా వంశవృక్షం నాతో అంతమయిపోతుందని బాధపడసాగాడు. నా క్షోభ అయితే వర్ణించనలవికానిది!! ఆ ఊర్లో తల ఎత్తుకుని తిరగలేకపోయాను. ఒక్కొక్కసారి చచ్చిపోతే అనిపించేది. కానయితే ఆత్మహత్య చేసుకోవడం అంత సులభం కాదు. దానికీ చాలా ధైర్యం కావాలి. ఆ ధైర్యమూ అప్పట్లో నాకు లేకుండాపోయింది. మా ఊరికి చాలా దూరంగావున్న ఈ సిటీలో ఒక ఉద్యోగం చూసుకుని అందర్నీ వదిలి వచ్చేశాను. ఇక్కడ ఎవరికీ నా గురించి తెలియకపోవటం వల్ల కొన్నాళ్ళు బాగానే గడిచాయి.

ఇంతలో నా తల్లీ తండ్రీ మనోవ్యాధితో పోయారు. నేను పూర్తి ఒంటరినయ్యాను. ఆస్థిపాస్తులన్నీ రాబందులాంటి బంధువులు ఆక్రమించేసుకున్నారు. ఒకసారి ఆ విషయం మీద ఊరువెళ్తే గొడ్డోడు ఆస్తి పట్టుకుని ఊరేగుతాడులా వుంది అని సణిగారు. ఒక్క క్షణం అక్కడ ఉండలేక వెనుతిరిగి వచ్చేశాను! రాత్రిళ్ళు ఆలోచనలు రాకుండా ఉండటానికి మందుని ఆశ్రయించాను. మొదట్లో ఈ చిట్కా బాగానే పనిచేసింది. కానీ ఆ తర్వాత నిషా అలవాటయ్యి తాగాక మరిన్ని ఆలోచనలు రాసాగాయి. సరిగ్గా అదే సమయంలో తిరిగి సుధ కనపడింది!

భర్త, పిల్లలతో ఆనందంగా నవ్వుతూ,

తుళ్ళుతూ కారులో వెళ్తూ కనపడింది!

ఆ రాత్రి నాకు కాళరాత్రి అయింది.

సుధ— నేనిలా ఉండిపోడానికి, నవ్వుల పాలవడానికి కారణమయిన సుధ— ఆనందమే జీవితంగా బతికేస్తోంది. కానీ నేను కసీ, కోపం, ఉక్రోషం, ఆక్రోశం, ఉద్రేకం, ఉన్మాదం, ఉద్వేగం, ఆవేశం, పిచ్చి అన్నీ నన్ను చుట్టుముట్టేశాయి. 'సుధ' అని నాలో . నేనే గట్టిగా అరచుకున్నాను. బాటిల్‌ని నేలకేసి కొట్టాను. ఏదో చెయ్యాలనే వెర్రిమొర్రి ఆలోచనలు అసంకల్పితంగానే నాలో చోటుచేసుకున్నాయి! కానయితే ఏం చెయ్యాలన్నా సంస్కారం అడ్డువచ్చేది! అలా నెల్లాళ్ళు నాలో నేను రగిలిపోయాను. ఎలా కనపడిందో అంత వేగంగాను సుధ వెళ్లిపోయింది. కానయితే మానుతున్న నా గాయాన్ని కెలికిపోయింది. ఆ క్షణం నుంచీ నాలో మార్పు మొదలయింది. నవ్వుతూ ఎవరు కనపడినా సుధ గుర్తు రాసాగింది. నవ్వుతున్న స్త్రీలయితే చెప్పనే అక్కర్లేదు! పిచ్చి కోపం వచ్చేది. బలవంతాన నా భావాల్ని లోలోపల అణచుకునేవాడిని! కానయితే రాత్రి అయ్యేటప్పటికీ ఆ భావాలు మరింత ప్రజ్వరిల్లి బయల్పడేవి! తట్టుకోలేక పొయ్యేవాడిని. అలా క్రమక్రమంగా సుధమీద కోపం, కసి అందరి మీదకు మళ్ళాయి. ఎవరు నవ్వినా నన్ను చూసి నవ్వినట్లే అనిపించేది!! రాత్రి వస్తోందంటేనే భయం పట్టుకునేది! ఎంత కంట్రోల్ చేసుకుందామన్నా ఆలోచనలు ఆగేవి కావు!! ఎదురుగా సుధ ఉన్నట్టు ఊహించుకుని దిండుని నలిపి నలిపి పిండి చేసేవాడిని! సుధా నిన్ను చంపేస్తాన్ అని అరచేవాడిని. అలాచేస్తుంటే మనస్సుకి కొద్దిగా శాంతి లభించేంది. ఏదో తృప్తి! అంతే అప్పట్నుంచీ సుధ అడ్రస్ సంపాదించి ఆమెకి లెటర్స్ రాయటం మొదలెట్టాను. ఎవరు రాస్తున్నారో తెలియకుండా పిచ్చిగా ఆమెని అనుభవించి ఖండఖండాలుగా నరికి చంపాలని ఉందని చాలా చాలాసార్లు ఆమెకి రాశాను. ఆ లెటర్



## ఫాంటసీ కలలు

మనలో చాలామంది ఫాంటసీ కలలు కంటూ వుంటారు ఎక్కువగా ఆలోచించేవాళ్ళకు అలాంటి ఫాంటసీ కలలు రావడం సహజమని శాస్త్రజ్ఞులు అంటున్నారు. 36 శాతంమంది వ్యక్తులు తాము మెలకువగా వున్నా, నిద్రపోయినాకూడా వాళ్ళ మెదళ్ళలోకి ఇంట్రావీనస్ గ్లూకోజ్ ఐసోటోప్స్ కొనిపోబడతాయి. ఈ చర్య ఆధారంగా గ్లూకోజ్‌ని మెదడు వివిధ భాగాలకి ఉపయోగించడం వల్ల చురుగ్గా ఆలోచించే మెదడు కారణంగా ఇలాంటి అద్భుతమైన ఫాంటసీ కలలు వస్తాయని కాలిఫోర్నియాలో ఓ యూనివర్శిటీకి చెందిన లూయిస్ ఎ.గాట్‌చాక్ కనుగొన్నాడు.

—ఆడపా చిరంజీవి

రాయగానే మనస్సుకి కొద్దిగా ఉపశమనం కలిగేది! పిచ్చి పిచ్చి ఆలోచనలు తగ్గేవి. రోజుకో లెటర్ చొప్పున పంపేవాడిని. ఆ లెటర్స్ చూసి సుధ బాధపడుతుందని తెలుసు! బాధపడటమే కాకుండా కుళ్ళికుళ్ళి ఏడవాలనే ఆ లెటర్స్ రాసేవాడిని! కానయితే ఈ మెంటల్ టార్చర్ భరించలేక సుధ ఆత్మహత్య చేసుకుని చచ్చిపోయినట్లు కొన్నాళ్ళకి తెల్సింది. ఆ రోజు ఆనందంతో గంతులేశాను. ఆమె ఏ కారణంచేత ఆత్మహత్య చేసుకుందో సరిగ్గా తెలియకపోయినా నా మూలంగానే చేసుకుందని విపరీతంగా ఆనందించాను. పిచ్చిపట్టిన నాలోని శాడిస్ట్ కొంతకాలం శాంతించాడు.

— కొంతకాలమే! మా ఆఫీసులో ఒక అమ్మాయి కొత్తగా చేరింది. ఆమె పేరు సుధారాణి. అప్పటికి నేను సెక్షన్ ఆఫీసర్‌నయ్యాను! నా దగ్గర ఆమె సబార్డినేట్. ఆమెని చూడగానే నాకు సుధ మళ్ళీ గుర్తొచ్చింది. ఆమె కట్టుబొట్టు, నడకా, నడతా అన్నీ సుధాలాగానే ఉన్నట్టనిపించింది! తుఫానులా నాలోని ఆలోచనలు తిరిగి విజృంభించాయి! రాత్రుళ్ళు అశాంతి మొదలయింది. అందరిముందు లోపలి ఆలోచనల్ని దాచుకుని డిగ్నిఫైడ్‌గా, పెద్దమనిషి తరహాలో ప్రవర్తించినా రాత్రి అయ్యేటప్పటికి నా మనస్సు నా స్వాధీనంలోంచి తప్పిపోయేది. చీకటిని చూడగానే పిచ్చి ఆలోచనలు మొదలయ్యేవి. నానపడుతూవుంటే ఆ ఆలోచనలు మరింత వికృతరూపం దాల్చేవి. ఒకరోజు ఉన్మాదస్థితిలో ఈ సుధలో నా సుధను ఊహించుకుని ఈమెకికూడా ఒక లెటర్ రాశాను. అది మొదలుగా మళ్ళీ లెటర్స్ రాసి ఆనందపడటమనే వింత ప్రవృత్తిని కొనసాగించాను... పాపం! ఆఫీస్‌లో రోజురోజుకీ పేలగా తయారవుతున్న సుధారాణిని చూస్తే ఒక్కొక్కసారి చాలా జాలేసేది! ఆమె నాకేం ద్రోహం చెయ్యనప్పుడు ఆమెని అంతలా హింసించడం తప్పనిపించేది. మానసిక హింసని తట్టుకోవడం కష్టమేనని నాకు బాగా తెలుసు! కానీ రాత్రి అయ్యేటప్పటికి నా కలం, నా చెయ్యి ఊరుకునేవి కాదు! కొన్నాళ్ళకి ఈ సుధారాణి జాబ్‌కి రిజైన్‌చేసి ఎవరినో పెళ్ళిచేసుకుని వెళ్ళిపోయింది. కొంతకాలం పిచ్చి తగ్గింది! ఈ లోపులో వాలంటరీగా రిటైర్ అయ్యాను!

పగలుకూడా ఖాళీగా కూర్చోవడం మొదలెడితే నా ఆలోచనలు మరింత బీభత్సం సృష్టించగలవని తెల్సుకాబట్టి— బిజీగా ఉంటంకోసం టైప్ ఇన్‌స్టిట్యూట్ ఓపెన్ చేశాను వర్కర్ని కల్పించుకుని పనిలోపడి స్టూడెంట్స్‌ని డిసిప్లిన్‌లో పెట్టి చాలా బిజీగా ఒక్కక్షణం తీరిక లేనంతగా మారాను! కానీ... రాత్రుళ్ళు ఆలోచన్లు మాత్రం వదిలేవి కావు! కానయితే కొద్దిగా తీవ్రతతగ్గింది. వయస్సు మీరడంవల్ల కావచ్చు అందులోను అందరూ నన్నుచూసి నవ్వుకోవడం తగ్గించారు. లేకపోతే నేనే పట్టించుకోవడం మానేశానో నాకు తెలియదు! నా వయస్సుని అందరూ గౌరవించడంతో పైకి పెద్దమనిషిలాగ ప్రవర్తించసాగాను.

ఒకరోజు— నేను అక్కడ లేననుకుని ఇద్దరు కుర్రాళ్ళు మాట్లాడుకుంటున్నారు.


"మాష్టారు పెళ్ళెందుకు చేసుకోలేదురా?" అని ఒకడడిగితే—

"ఆయనకది లేదేమో నీకెందుకు?" అని ఇంకొకడు చెపుతున్నాడు—

అంతే! వాలోని పైకో బుసలు కొట్టాడు!!

వాళ్ళిద్దర్నీ ఆ చెంపా ఈ చెంపా వాయగొట్టి బయటికి తోసేశాను. చిత్రంగా దీంతో నా ఇన్‌స్టిట్యూట్‌కి డిసిప్లిన్ విషయంలో మరింత పేరు వచ్చింది. స్టూడెంట్స్ రద్దీ పెరిగింది. అదే సమయంలో నాదగ్గరకొచ్చింది. వసుంధర! టైప్‌పాస్ కోసం సర్దాగా టైప్ నేర్చుకోవడానికి!! ఆమెని చూడగానే సుధలేచి వచ్చిందా అనిపించింది. అచ్చం అచ్చుగుద్దినట్లు అలాగే వుండేది. నాతో చనువుగా బాబాయిగారూ అంటూ వరుస కల్పింది. మాటల మధ్యలో ఒకసారి తెలిసింది. సుధ వసుంధరకి పిన్ని! అంతే మళ్ళీ నాలో పంచలనం ప్రారంభమయింది. భర్తతో ఆనందంగా జీవితం గడుపుతున్న ఆమెని చూస్తే నేను కోల్పోయింది ఏమిటో అర్థం అయింది. రాత్రి అయ్యేసరికి ఆమె, ఆమె భర్త కలిసి... ఆ ఆలోచనే పిచ్చి ఎక్కించేది! పైగా ఆమెని చూస్తుంటే సుధ అనుక్షణం గుర్తొచ్చేది! ఆమెకి లెటర్స్ రాయడం మొదలెట్టాను. ఒకప్రక్క లెటర్స్ రాస్తున్నా మరోప్రక్క నా తప్పు నాకు తెలుస్తూనే వుండేది! ఒక ప్రక్క అంతరాత్మ — మరో ప్రక్క ఆలోచనల ఉధృతి నాలో సంక్షోభం మొదలయింది! లెటర్ లెటర్‌కీ పచ్చిగా రాస్తేనేకానీ ఆనందం దొరికేది కాదు!

అదీకాక అన్నెం పున్నెం ఎరగని ఆడపిల్లల్ని చూసినా ఏదో ఇదీ అని చెప్పలేని కసి కలగసాగింది. వాళ్ళ నవ్వులు— అదే వయస్సులో నన్ను చూసి సుధ నవ్విన నవ్వుని పదే పదే గుర్తుకు తేసాగాయి. అదేసమయంలో వాళ్లతో నవ్వుతూ మాట్లాడుతూ సెక్స్‌పరమైన తృప్తిని పొందేవాడిని! నేను చేస్తున్నది తప్పని తెలిసినా నా బలహీనతల్ని జయించలే



కపోయేవాడిని. వసుంధర టైప్ మార్చమంటే కుదరదని పంపేశాను. ఆమె దూరమయితే సుధ జ్ఞాపకాలు దూరమవుతాయనుకున్నాను. కానీ అలా జరగలేదు. ప్రతీ అమ్మాయి సుధలాగే కనిపించసాగింది! జీవిత, వాణి, సాధన, రాగిణి, లావణ్య... అందరూ అలాగే వాళ్ళందరికీ లెటర్స్ వ్రాసి ఆనందపడటం మొదలెట్టాను. మై హార్ట్ ఈజ్ బ్రోకెన్ గ్రీటింగ్ కార్డ్లు నా వయస్సువాడు పది కొనడం చూసి ఆశ్చర్యపోయిన షాప్‌వాడిని చూస్తే ఎందుకీ బతుకు అనిపించింది. కానయితే బలహీనత మరో ప్రక్క...

ఇదీ నా కథ. మీరందరూ చదవాలని ఈ లెటర్స్ రాస్తున్నాను. మిమ్మల్ని బాధించాను. మానసిక క్షోభకి గురిచేశాను. అందుకని క్షమించమని కోరలేను. దయచేసి ఈ ముసలోడిని తిట్టుకోకండి! సానుభూతితో అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి!

ఇలాంటి బతుకు పగవాడికి కూడా రాకూడదు! ఇన్నాళ్ళు ఏ ధైర్యం లేక ఆగిపోయానో ఆ ధైర్యం ఇన్నాళ్ళకి కూడగట్టుకోగలిగాను. అందుకే వెళ్ళిపోతున్నాను! వెళ్ళిపోయేముందు మీ అందరికీ ఈ విషయం చెప్పకుండా పోవచ్చు. కానీ అది నా కిష్టం లేదు. నా జీవితం గురించి మీరందరూ తప్పక తెలుసుకోవాలి. ఏ స్థితిలో ఇంతటి లజ్జారహితంగా ప్రవర్తించినదీ మీరు అర్థం చేసుకుంటారనే నా ఆశ!

నాకున్న యావదాస్తిని 'చిన్మయ అనాథ సంఘానికి' ఇవ్వవల్సింది. నేను జీవితంలో చేస్తున్న మొట్టమొదటి మంచి పని ఇదే, చివరిది ఇదే!

చివరగా నా జీవితాన్ని సానుభూతితో పరిశీలించమని కోరుతూ—

వస్తున్నా సుధా!

సుధారాణి, వసుంధరా, జీవిత, వాణి, సాధన, రాగిణి, లావణ్య, ప్రియాంక.

సెలవ్

—అభాగ్యుడు అనుకుంటే అభాగ్యుడు
దౌర్భాగ్యుడు అనుకుంటే దౌర్భాగ్యుడు
అయిన
రామనాథం



## కేన్సర్ నుంచి విముక్తి

రెక్టల్ మరియు కోలోన్ కేన్సర్‌తో బాధపడేవాళ్ళు ఇప్పుడు ఆ వ్యాధినుంచి విముక్తి పొందే అవకాశం వుందని న్యూ ఇంగ్లాండ్ లోనీ వైద్యపత్రికలో ప్రకటించబడింది.

కోలోన్ కేన్సర్ వున్న పేషెంట్స్‌కి కెమోథెరపీని, అదనంగా స్టాండర్డ్ రేడియేషన్ ట్రీట్‌మెంట్‌ని ఇచ్చినట్లయితే వాళ్ళ జబ్బు నయం కావడానికి అవకాశాలు మెండుగా వున్నాయని సైంటిస్టులు కనుగొన్నారు. 204మంది పేషెంట్స్‌ని పరీక్షించి ఈ విషయం కనుగొన్న అమెరికాలోని జాతీయ ఆరోగ్య కేంద్రాలు ఈ కేన్సర్ చావుల శాతం మూడొంతులకు తగ్గుతుందని చెపుతున్నారు.

—అడపా చిరంజీవి